


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### *పచ్చ బొట్టేసినా...*

**వెంకవ్వా, క్రిష్ణవ్వా** రోజూ మా ఇంటిముందు నుండే వెళ్ళేవారు. నాకు అప్పుడు పదేళ్ళుండేవేమో. సందానీ నేనూ కలిసి బడికి వెళ్తాం అని ఇంట్లో చెప్పి ప్రతి బురద గుంట దగ్గరా చేపలు పట్టే రోజులవి. అప్పుడు ముఖ్యమంత్రిగా ఎవరుండేవారో గుర్తులేదుకానీ ప్రధానిగా ఇందిరాగాంధీ వుండే రోజులు. ఎంతైనా ఆడవాళ్ళు ఒకింత తలెగరేసి, పైట ఝూడించి తిరిగే రోజులు. "దేశ ప్రధానే స్త్రీ, ఆడదానివి నువ్వేం చేస్తావు? అనకండి" అని మొగుళ్ళని అవసరమైతే రేవు పెట్టే కాలం అది. అయినా తాగొచ్చి ధైర్యం తెచ్చుకుని, పెళ్ళాలని సందాని అబ్బాజాన్‌లాంటి వాళ్ళు ఉతికే మాయదారి రోజులవి.

ఇంతకీ చెప్పొచ్చేదేంటంటే అమ్మమ్మ ఒత్తులు చేసుకుంటూ వీధి వరండా మీద కూర్చుంటే, పొద్దున్నే సిగరెట్ ఫ్యాక్టరీలో కార్మికులూ, సాయంత్రం పని అయ్యాక ఇళ్ళకి చేరుతున్న పక్షుల్లా ఇళ్ళల్లో పనిచేసే ఆడవాళ్ళూ, బీడీ కార్మికురాళ్ళూ, బడిలో పంతులమ్మలూ, గుడిలో పంతుళ్ళూ, అంతా అమ్మమ్మ దగ్గర ఎటెండెన్స్ వేసుకుని వెళ్ళాల్సిందే అది రివాజు.

అలాగే క్రిష్ణవ్వా, వెంకవ్వా కలిసి రోజూ మా ఇంటిముందు నుండే పనికి వెళ్ళేవాళ్ళు. వెంకవ్వ తెల్లగా, కొంచెం కాలు ఈడుస్తూ, చెయ్యికూడా కొద్దిగా మోచేతి కిందనుండీ లావుగా వుండేది. క్రిష్ణవ్వ పేరుకి తగ్గట్లు క్రిష్ణవర్ణం, అయినా మొహంలో తెల్లని దంతాలు మెరుస్తూ కళకళలాడేవి. ఇద్దరికీ యాభై పైబడి వుండచ్చు. ఏంటో అప్పట్లో అమ్మలంతా ఒకరిద్దరు పిల్లలు పుట్టగానే, అమ్మమ్మలయిపోయినట్లు, జుట్టు వేలిముడి వేసుకుని, నూలు చీరా, మొహం వాడిపోయి, నీరసంగా, పాకిపోయిన కుంకుమతో, కళ్ళకి కాటుకతో, ఈసురోమని వుండేవారు. అలాగే ఇళ్ళల్లో పనిచేసే వాళ్ళని ʻఅవ్వʻలని పిలిచేవాళ్ళు.

ఇప్పుడు తలుచుకుంటే నాకు రంగనాయకమ్మగారికొచ్చినంత ఆవేశం వస్తోంది. ఇప్పుడు మా ఇంట్లో పనిచేసే వరాలుని, నేను "వరం...హనీ..బ్యూటీ" అని పిలుస్తుంటా. అప్పట్లోనూ కొద్దిమంది ఇంటి యజమానులు అలా పని మనిషిని పిలిచి, పెళ్ళాలతో పూజ చేయించుకుని, నెత్తిమీద బొప్పితో ఆఫీస్‌లకెళ్ళేవాళ్ళు వుండేవారు అనుకోండీ.

ఇంతకీ ఆ క్రిష్ణవ్వా, వెంకవ్వలని నెలకోమాటు అమ్మమ్మ 'అర్బన్ క్లాప్'లో బుక్ చేసినట్లు "వెంకా, రేపు శెలవేగా ఇంట్లో పనివుంది రండి" అని బుక్ చేసేది.

తెల్లారేసరికల్లా అప్ప చెల్లెళ్ళు ఇద్దరూ వచ్చి, బియ్యం చేసేవారు. మిరపకాయలు దంచేవారు. రవ్వ విసిరేవారు. మిగతా పోపు సామాన్లూ, పప్పులూ అన్నీ చెరిగేవారు. సాయంకాలం దాకా పనిచేసి, మధ్యలో అమ్మమ్మ పెట్టిన అన్నం తిని, చాయ్ తాగి, ఆవిడ ఇచ్చిన మూడో, ఐదో రూపాయలు పట్టుకుని కిలకిలలాడుతూ వెళ్ళేవాళ్ళు.

వాళ్ళు బియ్య చేస్తుంటే, నేనూ సందానీ ఆసక్తిగా వాళ్ళ చేతులు చూసేవాళ్ళం. ఆ వెంకవ్వ చేతులమీద సర్పబంధాలూ, తీగలూ, ఏవో అక్షరాలూ వుంటే, క్రిష్ణవ్వ చేతిమీద పచ్చగా ఒక పల్లకీ, అందులో ఓ మనిషి మొహం, కింద ఏదో భాషలో అక్షరాలూ మణికట్టునుండీ భుజం దాకా వుండేవి. అప్పుడే దాన్ని పచ్చబొట్టు అంటారని నాకు తెలిసింది.

"అమ్మమ్మా మనం అలా ఎందుకు వేయించుకోమూ?" అని అడిగితే

"అవ్వలాళ్ళు అలా వేయించుకుంటారు. మనం వేయించుకోకూడదు" అంది అమ్మమ్మ.

మళ్ళీ వర్గ అసమానత. హూ ఏం చేస్తాం. వూరుకునే దాన్ని.

"కిష్టవ్వా నీకీ చేతిమీద ఆయనెవలు?" సందానీ ఒకసారి అడిగాడు.

కిష్టవ్వ ముసి ముసిగా నవ్విందే తప్ప ఏమీ చెప్పలేదు.

"వినాయకుడా?" అన్నాను.

ఆమె బియ్యం చెరిగేటప్పుడూ పైట నడుంకి కట్టుకుని, రవికె ముడి ఎగిరెగిరి పడేట్లు బియ్యం విసిరేది. అప్పుడు మెడకింద కూడా పచ్చబొట్లు చూసాను. గెడ్డం కింద మూడు చుక్కలు కూడా.

"ఆంజనేయ స్వామా?" మళ్ళీ అడిగాను.

ఆమె నవ్విందే గానీ మాట్లాడలేదు. పోల్చుకోడానికి మేం ఎంత ప్రయత్నించినా, మనిషీ అని తప్ప మొహం ఆనవాలు పట్టలేకపోయాం.

అప్పటి నుండీ పచ్చబొట్లు వేసుకున్న వాళ్ళ మీద మా కాన్సన్‌ట్రేషన్ పెరిగిపోయింది. నేనెప్పుడూ "పచ్చబొట్టూ చెరిగిపోదులే .. నా రాజా పాట రేడియోలో వస్తుంటే "పచ్చబొట్టు పాట వస్తోంది గట్టిగా పెట్టు" అని అమ్మతో అనేదాన్ని.

"నిజంగా చెరిగిపోదా?" అని అమాయకంగా అడిగేదాన్ని.

"ఓసారి వేయించుకున్నాక, ఈ కట్టెతో కాలిపోవాల్సిందే కానీ చెరిగిపోదు." అని అమ్మ చెప్పింది.

మా ఇంట్లో పనిచేసే శ్యామలమ్మ అయితే "పచ్చబొట్టూ వేయించుకోవడం అంత వీజీకాదు బుజ్జమ్మా. సూదులు కాల్చి, మందులో ముంచి "సుయ్యి సుయ్యి" అని వేస్తుంటే, ఒకటే మంటా, నెప్పీ, మరుసటి దినం వాచి పుండ్లై, జ్వరం వచ్చింది నాకైతే" అని చేతులకి గాజుల్లా, కాళ్ళకి కడియాల్లా వేసుకున్న తన 'పచ్చ' చూపించింది.

"ఎందుకంత కష్టపడి అది వేయించుకోడం" అని అడిగాను.

"నేనెక్కడ వేయించుకున్నాను ఇది నా మొగుడు వేయించాడు. శివలింగం" అని చూపించింది.

"మరి ఇదో హిందీలో 'రాంలాల్' అన్న అక్షరాలు చూపించి అడిగాను. "నా మొగుడు పోయాక, రాంలాల్ మీద మనసైనప్పుడు నేనే వేయించుకున్నాను" కొద్దిగా సిగ్గుపడుతూ చెప్పింది.

"నీకు ఇద్దరు మొగుళ్ళా?" ఆశ్చర్యంగా అడిగాను.

''ఏయ్ నోర్ముయ్. శ్యామలా నీ పనిచూసుకో'' అమ్మమ్మ అరిచింది. అసలు ఇంట్రెస్టింగ్ టాపిక్స్ ఏవీ మాట్లాడనివ్వకుండా, పోలీసులా ఈ అమ్మమ్మ ఒకత్తీ అని విసుక్కున్నాను. కానీ ఏతావాతా ప్రేమించిన వాళ్ళ పేర్లు అలా చేతిమీద పచ్చబొట్టు వేయించుకుంటారు అని తెల్సింది.

సందానీతో ''శ్యామలమ్మకి ఇద్దరు మొగుళ్ళు తెలుసా?'' అన్నాను.

''మరి ఎనిమిది మంది పిల్లలకీ, వాళ్ళ నాయన ఎవరో తెలుసా?'' అని ముదురు ప్రశ్న అడిగాడు.

నాకు చాలా కన్ఫ్యూజింగ్‌గా అనిపించింది.

ఆ సాయంత్రం ''మీ పిల్లలకి నాన్న ఎవరో ఎట్లా తెలుస్తుందీ'' అని శ్యామలమ్మని అడిగేసాను.

శ్యామలమ్మ బాగా నవ్వి ''సరోజినీ, లక్ష్మీబాయీ, కళావతీ, జగన్, దశరథ్ మొదటి ఆయనకే పుట్టిన్రు'' అంది.

''అంటే మిగతావాళ్ళూ?''

ఆమె వేళ్ళు ముడిచి లెక్క పెడ్తూ ''ఐదుమంది పెద్దాయనకి. ఆయన సచ్చిపోయినంక మోహన్‌లాల్, లీలావతీ, లతా రాంలాల్‌కి'' అంది.

''వీళ్ళంతా తెల్లగా వున్నారెందుకు?'' మళ్ళీ నా ముదురు ప్రశ్న.

శ్యామలమ్మ సిగ్గుపడి, ''రాంలాల్ గుజరాతీవాడు, మిఠాయి షాప్‌లో పనిచేసేవాడు. అతను పాలకోవాకి పాలు మరగబెట్టి కలుపుతుంటే, ఆయనకూడా అదే రంగులో వుండేవాడు'' అని నవ్వుతూ చెప్పింది.

''ఇప్పుడెక్కడున్నాడు?''

''సచ్చిపోయాడు. ఇంత మంది పిల్లల్ని సాకమని నాకు అప్పచెప్పి'' అంది కళ్ళనీళ్ళు తిరుగుతుండగా.

''అయ్యో'' అన్నాను.

''ఎలా పోయాడు?''

''తాగి తాగి సచ్చిండు'' అంది.

తర్వాత ఎవరో బంధువులు వచ్చినప్పుడు మీనాక్షి అత్తయ్యకి రామం పుట్టగానే భర్తపోయాడుగా పాపం. అప్పటికింకా ఇరవై మూడో ఏడు అని ఎవరిగురించో అమ్మ చెప్తుంటే ''మన శ్యామలమ్మలా మళ్ళీ పెళ్ళి చేసుకోవలసింది'' అన్నాను.

''నోర్ముయ్.. పెద్ద మాటలూ నువ్వూనూ'' అంది అమ్మమ్మ.

''మనలో అలా చేసుకోం'' అంది అమ్మ.

''ఏం పనిచేసేవాళ్ళే చేసుకుంటారా రెండో పెళ్ళి?'' అడిగాను.

''శ్యామలమ్మ చెప్తోందా ఈ వెధవ కబుర్లన్నీ'' అని అమ్మమ్మ నన్ను వీపు మీద రెండు అంటించడమే కాకుండా, పాపం శ్యామలమ్మని తిట్టింది.

సందానీ ఓ రోజు ''ఏ.వీ రమణీ. నీకొకటి చూపించాలి'' అని అరుచుకుంటూ వచ్చాడు.

''ఇప్పుడు కాదురా! ఇంగ్లీష్ నోట్స్ రాయకపోతే రేపు మసి సార్ తిడ్తాడు'' అన్నాను. ఆయన పేరు మస్తాన్ అందరూ ''మసి'' సారి అనేవారు. అప్పట్లో వర్గ వివక్షతే కాదు వర్ణ వివక్షత కూడా ఎక్కువే అని ఇప్పుడు తెలుస్తోంది.

''అబ్బా! ఒకసారి రా'' అని నన్ను తొందరపెట్టి, ఇంటి బయట వేపచెట్టు కిందకి తీసుకెళ్ళి, తన చెయ్యి గుప్పెట తెరిచాడు ఖాళీగా వుంది.

''ఏ వుందీ గుప్పెటలో? నీ మొహం?'' అన్నాను.

"అబ్బా! గుప్పెటలో చూస్తాయి? చేతి మీద చూడు" అన్నాడు.

చూసా. పచ్చబొట్టు.

"గాంధీ తాత" అన్నాడు. గుప్పెట బిగించాడు, నరాలన్నీ దగ్గరకొచ్చి 'కోతి'లా కనిపించిందా బొమ్మ.

నాకు కిష్టవ్వ చేతిమీద పచ్చబొట్టు గుర్తొచ్చింది. చెయ్యి జాపినప్పుడు ఒకలాగా, ముడుచుకున్నప్పుడు ఒకలాగా, కనిపించే ఆ ముఖం గుర్తొచ్చింది. తర్వాత కిష్టవ్వని "మీ ఆయనా?" అని ఆ బొమ్మని చూపించి అడిగాను.

విషాదంగా చూసింది.

"మిలటరీలోకి పోకపోతే ఆయన కావలసినవోడే బుజ్జమ్మా" అంది.

అది విన్న శ్యామలమ్మ "ఆడినే తలుచుకుంటూ లగ్గం చేసుకోలేదు. వాడు మిలటరీలోనే 'షహీద్' అయినడంట. అప్పడి సంది అక్కనీ, అక్క పిల్లల్నీ సాక్కుంట అక్కతాననే వుంది" అంది.

మొత్తానికి 'పచ్చబొట్టు' అనేది ప్రేమకి ప్రతీకగా నా మనసులో నిలిచిపోయింది. రెండు పెళ్ళిళ్ళు చేసుకున్న శ్యామలమ్మ అయినా, అసలు పెళ్ళే చేసుకోకుండా ప్రియుడి కోసం ఒంటరిగా మిగిలిపోయిన క్రిష్టవ్వ అయినా పచ్చబొట్టులో ప్రేమనే నిలబెట్టుకున్నారు.


"పచ్చబొట్టేసినా.. పిల్లగాడా నీతో
పచ్చి ప్రాయాలనే పంచుకుంటానురా..
జంట కట్టేసినా తుంటరోడా నీతో
కొంటె తంటాలనే తెచ్చుకుంటా దొరా.."

అని అనంత్ శ్రీరామ్ రాసిన పాట వింటుంటే, నా చిన్ననాటి జ్ఞాపకాల దొంతరలు విచ్చుకుంటాయి.

ఆ పచ్చబొట్టే యూనివర్సిటీ కెళ్ళి 'గ్రాడ్' వాక్ చేసి.. ఇప్పటి 'టాటూ'గా మారి, ఈ కాలం పిల్లల ఒళ్ళంతా పాకి.. 'ఫ్యాషన్' గా మారింది. పాతవన్నీ కొత్తవి కాక మానవులే.




Post your comments







https://www.youtube.com/watch?v=ERaaX_IulS4